# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 10-06-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గత 11 సంవత్సరాలలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

2. **సంక్షేమంతో పాటు, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ సంస్థకు శంకుస్థాపన చేశారు.**

4. **పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదల పనులను ఈనెల 30నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

5. **అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.**

==========================

గత 11 సంవత్సరాలలో దేశం అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంతో పాటు పలు అంశాల్లో ప్రపంచ వేదికపైనా బలమైన ముద్ర వేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వానికి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'వికసిత్ భారత్ కా అమృత్ కాల్' అనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా వికసిత్ భారత్ ఎజెండానే తమ లక్ష్యమని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ ఏడాది పాలనలో ఆపరేషన్ సింధూర్, వక్ఫ్ సంస్కరణలు, ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతి పెరిగిందని పేర్కొన్నారు. 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' అనేదే తమ పాలనను నిర్దేశించే మూలసూత్రమని చెప్పారు.సుపరిపాలన, పరివర్తనే లక్ష్యంగా ముందుకువెళుతున్నామని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

--------------------------

సిలికాన్ వ్యాలీలా అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్వాంటమ్ మిషన్‌పై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఐటీ రంగ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అమరావతిలో క్వాంటమ్ వాలీ వ్యవస్థ ఏర్పాటుపై అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన క్వాంటమ్ మిషన్‌పై రాజధానిలో కార్యశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్వాంటమ్ వ్యాలీ నిర్మాణం నుంచి ప్రతి

అంశంపై అత్యంత శద్ధ తీసుకోవాలని, ఐకానిక్‌గా బిల్డింగ్ నిర్మాణం జరగాలని అధికారులకు సూచించారు. క్వాంటమ్ మిషన్‌ను రెండు దశలుగా పూర్తి చేయనున్నామని తెలిపారు.

---------------------------

సంక్షేమంతో పాటు, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతి సచివాలయం నుంచి స్వర్ణాంధ్ర కార్యాలయాలను దృశ్య మాధ్యమం విధానం ద్వారా నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సేవారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అన్ని ప్రాంతాలను సమాంతరంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ ..35 సెకన్లు

---------------------------

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు ప్రభుత్వ ప్రజల ప్రైవేటు భాగస్వామ్యం పీ4 కార్యక్రమం దోహదపడుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. అమరావతి నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించిన స్వర్ణాంధ్ర కార్యాలయాల ప్రారంభోత్సవం శ్రీకాకుళం నుంచి కేంద్ర మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నియోజకవర్గానికీ స్పష్టమైన అభివృద్ధి, కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లాలో ఉన్న సముద్ర తీరం, రవాణా వనరులు, వ్యవసాయ శక్తిని సంపూర్ణంగా వినియోగించుకుంటూ, జిల్లా తలసరి ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

---------------------------

కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ హైదరాబాద్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్–ఐసీఏఆర్ లోని ప్రాంగణంలో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ పేరుతో ఏర్పాటు కానున్న సంస్థకు గత సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సంస్థ సిరిధాన్యాల పరిశోధన, అభివృద్ధి శిక్షణ, ప్రాచుర్యం కల్పించే దిశగా కీలక మైలురాయిగా నిలుస్తుందని శివరాజ్‌సింగ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఈ సంస్థ మార్గదర్శకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

---------------------------

పోలవరం ఎడమ కాలువ ద్వారా నీటి విడుదలకు సంబంధించిన పనులను ఈనెల 30నాటికి పూర్తి చేస్తామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కాటన్ అతిథి గృహంలో జలవనరుల శాఖ అధికారులతో మంత్రి గత సాయంత్రం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..

..వాయిస్... 26 సెకన్లు

---------------------------

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం పురపాలక సంఘం పరిధిలోని మద్దులపల్లి, తెల్దారుపల్లి,

పోలే పల్లి ప్రాంతాల్లో కచ్చా రోడ్లకు నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

..వాయిస్... 31 సెకన్లు

---------------------------

పట్టణ, స్థానిక సంస్థల పరిధిలో ఉన్న ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణకు ప్రణాళికను సిద్ధం చేసేందుకు పురపాలక శాఖ, స్వచ్ఛాంధ్ర సంస్థ అధికారుల బృందం ఉత్తరప్రదేశ్ లోని లక్నోలో ఈ రోజు నుంచి మూడురోజుల పాటు అధ్యయనం చేయనుంది. ఈ పర్యటనలో పురపాలక శాఖ సంచాలకులు, స్వచ్ఛాంధ్ర సంస్థ ఎండీ, చీఫ్ ఇంజినీర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్లు పాల్గొననున్నారు. లక్నోలో ఈ–వాహనాల ద్వారా చెత్తను సేకరిస్తున్న తీరును పరిశీలించి, ఘనవ్యర్థాల నిర్వహణలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకోనున్నారు.

---------------------------

లబ్ధిదారులకు రేషన్ సరకుల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని డీలర్లకు ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఏలూరులోని రేషన్ దుకాణాన్ని ఆయన నిన్న ఆకస్మికంగా తనిఖీ చేసి బియ్యం, ఇతర నిత్యావసర సరకులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సర్వర్ సమస్యతో సరకుల పంపిణీని ఎక్కడా ఆపవద్దని, అవసరమైతే లబ్ధిదారుడి ఫొటో తీసుకుని, సంతకం చేయించుకుని నిత్యావసరాలు ఇవ్వాలని స్పష్టం చేశారు.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎమ్. వెంకటరావు పేర్కొంటూ...

వాయిస్...28 సెకన్లు

తెలంగాణలోనూ రానున్న రెండురోజులపాటు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

=====================